గణేష్ నిమజ్జనానికి విస్తృత ఏర్పాట్లు

- చిన్న చెరువు కట్ట వద్ద పూర్తయిన పనులు
- ఐదు క్రేన్‌లతో ప్రతిమల నిమజ్జనం
- ఘాట్ వద్ద, కూడళ్లలో ప్రత్యేక వైద్య శిబిరాలు
- మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ
- దాదాపు 500 మంది పోలీసు సిబ్బందితో గస్తీ
- ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ మహేశ్వరరెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసులు, కమిషనర్ రవిచంద్రారెడ్డి


వినాయక ఘాట్ వద్ద రోడ్డును చదును చేసి, బారికేడ్లు ఏర్పాటు చేసిన దృశ్యం


వినాయక ఘాట్ వద్దకు చేరిన భారీ క్రేన్


ఘాట్ వద్ద ఫ్లడ్‌లైట్లను అమర్చుతున్న విద్యుత్ సిబ్బంది

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం నిమజ్జనోత్సవాన్ని వైభవంగా నిర్వహించడానికి గణేష్ కేంద్ర ఉత్సవ కమిటీ, అధికారులు వినాయక ఘాట్‌ను గురువారం తీర్చిదిద్దారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలను అమలు చేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. గణేష్ నిమజ్జనాన్ని శుక్రవారం ఉదయం నుంచి అర్ధరాత్రి దాటే వరకు నిర్వహించనున్నారు. చెరువు కట్టపై నూతనంగా తాత్కాలిక రోడ్డును నిర్మించారు. ఫ్లడ్‌లైట్లు, బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేయడానికి ఐదు క్రేన్‌లను అందుబాటులో ఉంచారు.

ర్యాలీ ఇలా..

- నూనెపల్లె, టెక్కె, సాయిబాబానగర్, ఎన్‌జీఓ కాలనీ, ఎస్‌బీఐ కాలనీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను శ్రీనివాస సెంటర్ మీదుగా బాలాజీ కాంప్లెక్స్, ఫరూక్‌నగర్, ఆత్మకూరు బస్టాండ్ మీదుగా వినాయక ఘాట్‌కు తీసుకు రావాలి. అక్కడి నుంచి వరుసగా వెళ్లాల్సి ఉంటుంది.
- రైల్వే స్టేషన్ ఏరియా, మూలసాగరం, బొమ్మల సత్రం ప్రాంతాల్లోని విగ్రహాలను ఆర్టీసీ బస్టాండ్ ద్వారా నేరుగా విక్టోరియా రీడింగ్ రూం వద్దకు చేరాలి. విక్టోరియా రీడింగ్ రూం, మెయిన్ బజార్, గాంధీచౌక్, పార్కురోడ్డు మీదుగా వినాయక ఘాట్‌కు చేరాలి.

ఆంక్షలు..

- గణేష్ నిమజ్జనం సందర్భంగా పోలీసులు పలు ఆంక్షలను విధించారు.
- వీధుల్లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలకు ఉదయమే పూజలు పూర్తి చేసి, నిమజ్జనానికి బయల్దేరాలి.
- నిర్వాహకులు టపాసులను పేల్చరాదు.
- కల్పనా సెంటర్ నుంచి వరుస క్రమంలో విగ్రహాలను ఊరేగింపు నిర్వహించాలి.
- మద్యం సేవించి ఉత్సవాల్లో పాల్గొనరాదు.
- కల్పనా సెంటర్, బైర్మల్‌వీధి, మెయిన్ బజార్, గాంధీచౌక్, పార్కురోడ్ ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను నిషేధించారు.
- 500 మంది పోలీసు సిబ్బందితో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.
- సున్నితమైన ప్రదేశాల్లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్లను ఏర్పాటు చేశారు.
- విగ్రహాలకు విద్యుత్ వైర్లు ఇబ్బంది లేకుండా చూసుకునేందుకు 25 ప్రదేశాల్లో 25 మంది అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు.
- మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఆరుగురు గజ ఈతగాళ్లు, ఆరు బోట్లను ఏర్పాటు చేశారు.
- వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జగజ్జననీనగర్, హరిజనవాడ, ఎన్‌జీఓస్ కాలనీ, శ్రీనివాసనగర్, గాంధీనగర్, దేవనగర్ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు.
- వినాయక ఘాట్ వద్ద పూజా సామగ్రి వేయడానికి పెద్ద పెద్ద డస్ట్ బిన్‌లను మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.
- ప్రజలకు తాగునీరు, సేమినాయాలు, బారికేడ్లను ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

స్వాగత వేదిక ఏర్పాటు..


గణేష్ విగ్రహాలకు స్వాగతం పలుకుతూ గాంధీచౌక్‌లోని గణేష్ కేంద్ర ఉత్సవ కమిటీ వేదికను ఏర్పాటు చేసింది. ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి, కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, డీఆర్‌ఓ పుల్లయ్య, ఆర్‌డీఓ శ్రీనివాసులు, డీఎస్పీ మహేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, తహసీల్దార్ శ్రీనివాసులు, గణేష్ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణారెడ్డి, అధ్యక్షుడు గంగిశెట్టి విజయకుమార్ విగ్రహాలకు స్వాగతం పలుకుతారు.

పోలీసులకు సహకరించాలి



నిమజ్జనానికి భారీ బందోబస్తు ఏర్పాటు చేశాం. ప్రశాంతంగా జరగడానికి పలు ఆంక్షలను విధించాం. నిర్వాహకులు పోలీసులకు సహకరించాలి. ఎలాంటి అల్లర్లకు పాల్పడినా, ఆంక్షలను ఉల్లంఘించినా ఉపేక్షించం. – రఘువీర్‌రెడ్డి, ఎస్పీ, నంద్యాల

భక్తి శ్రద్ధలతో గణేష్‌కు వీడ్కోలు



ప్రజలు భక్తి శ్రద్ధలతో గణేష్‌కు వీడ్కోలు చెప్పడానికి ఏర్పాట్లు చేశాం. ఉత్సవ కమిటీల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలి. మద్యం సేవించి ఉత్సవాల్లో పాల్గొనడం, అల్లర్లకు పాల్పడటం చేయరాదు.
– డాక్టర్ రామకృష్ణారెడ్డి, గౌరవ అధ్యక్షుడు, గణేష్ కేంద్ర ఉత్సవ కమిటీ


ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ, రెవెన్యూ అధికారులు

క్లుప్తంగా

రీసర్వేతో రైతులకు ప్రయోజనం


మందలూరులో రైతులకు పత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గోస్పాడు: జగనన్న భూహక్కు–భూసర్వేతో రైతులకు ఎంతో ప్రయోజనకరమని మండల ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాయపాడు గ్రామంలో గురువారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయశేఖర్ ఆధ్వర్యంలో రైతులకు భూహక్కు పత్రాలను అందజేశారు. జనార్ధనరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఎంతో కాలంగా నెలకొన్న భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ రాయపాడులో 223, ఎం.చింతకుంట్లలో 910, పసురుపాడులో 706, ఎం.క్రిష్టాపురంలో 466 భూహక్కు పత్రాలు రైతులకు అందజేసినట్లు తెలిపారు. డీటీలు రామచంద్రారావు, ఉశేని, వీఆర్‌ఓ పెద్దయ్య, సర్వేయర్ వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని మందలూరులో గురువారం డిప్యూటీ తహసీల్దారు మహబూబ్ బాషా రైతులకు జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలను సర్పంచు నిర్మలమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి పంపిణీ చేశారు. డిప్యూటీ తహసీల్దారు మాట్లాడుతూ గ్రామ పరిధిలోని 639 మంది రైతులకు సంబంధించి 2,100 ఎకరాల భూమి ఉండగా ఇటీవల సర్వే నిర్వహించి హద్దులు గుర్తించారు. సర్వేకు సంబంధించి ప్రభుత్వం నుంచి వచ్చిన జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలను ఆయా రైతులకు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో ఫక్రుద్దీన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో భూ రీ సర్వే పూర్తి

నంద్యాల(అర్బన్): మండలంలోని చాబోలు, చాపిరేవుల, పుసులూరు, గుంతనాల, రాయమాల్పురం, మునగాల, కొట్టాల గ్రామాల్లో చేపట్టిన జగనన్న భూహక్కు–భూ సర్వే పనులు పూర్తయ్యాయని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. రీ సర్వే పూర్తవడంతో పొలాల్లో సిబ్బంది హద్దు రాళ్లు పాతుతున్నారు. చాబోలు గ్రామంలో శుక్రవారం చేపట్టిన హద్దురాళ్లు పాతే పనులను మండల సర్వేయర్ సహదేవుడుతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో సంబంధిత రైతులకు పత్రాలను అందజేస్తామని చెప్పారు.

భారీ వర్షం


క్రిష్టిపాడులో కురుస్తున్న వర్షం

దొర్నిపాడు: ఉదయం నుంచి సూర్యుడి ప్రతాపానికి ఉక్కపోతతో అల్లాడిన జనానికి సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకొని వర్షం కురిసింది. మండలంలో గురువారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వాగులు వంకలు పొంగిపొర్లడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. సాగుచేసిన మిరప, జొన్న, వరి, పత్తి పంటలకు ఈ వర్షం ప్రాణం పోసినట్లయ్యిందని పేర్కొంటున్నారు.

అభ్యుదయ సాహిత్యానికి ఆద్యుడు గురజాడ


గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

నంద్యాల(వ్యవసాయం): అభ్యుదయ సాహిత్యానికి గురజాడ ఆద్యుడని అరసం గౌరవాధ్యక్షుడు డాక్టర్ కణాముర‌ళీ పేర్కొన్నారు. గురువారం గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకొని స్థానిక భగత్‌సింగ్ గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు తేటైన పదాలతో ముత్యాల సరాలు, దిద్దుబాట్లు, కన్యాశుల్కం నాటకాన్ని ఎంతో గొప్పగా రచించారన్నారు. ఉపాధ్యక్షుడు నీలకంఠమాచారి మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి ఎవరూ చేయనటువంటి కృషి చేశారని కొనియాడారు. అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, ప్రసాద్, అశోక్, చంద్రబోస్ పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి దినోత్సవం


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు 2001 నుంచి సెప్టెంబర్ 21న ప్రపంచ శాంతి దినోత్సవాన్ని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, సూరన సారస్వత అధ్యక్షుడు డాక్టర్ సహదేవుడు తెలిపారు. గురువారం పట్టణంలోని రావూస్ కళాశాలలో ప్రపంచ శాంతి దినోత్సవాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ బుద్ధుని నుంచి గాంధీ, మదర్ థెరిస్సా వరకు ప్రపంచంలో శాంతి స్థాపనకోసం విశేష కృషి జరిగిందన్నారు. అనంతరం ప్రపంచ శాంతి స్థాపనలో భారత దేశ పాత్ర అనే అంశంపై జరిగిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఇమ్రాన్, అఖిల్, రెహాన్‌కు బహుమతులు అందజేశారు. క్లబ్ కార్యదర్శి సాగరాజు, జోనల్ చైర్మన్ చంద్రనమోహన్ ప్రిన్సిపాల్ సుంకయ్య పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

నంద్యాల(అర్బన్): ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బెనర్జీ మాదిగ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టాలంటూ గురువారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్, ఎంఈఎఫ్ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైన వందరోజుల్లో వర్గీకరణ చేపడుతామంటూ అధికారంలోకి వచ్చి 8ఏళ్లు పూర్తయినా హామీ నెరవేర్చలేదన్నారు. కత్తి ఓబులేసు మాదిగ, చంటి మాదిగి, రాజు మాదిగ పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబులేసు డిమాండ్ చేశారు. గురువారం పట్టణ శివారులోని జాతీయరహదారిని దిగ్బంధించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో చేస్తామని చెప్పిన బీజేపీ పదేళ్లు అవుతున్నా పట్టించుకోలేదని మండిపడ్డారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసేసరికి బిల్లు ప్రవేశపెట్టాలని లేకపోతే ఉద్యమం తీవ్రం చేస్తామని హెచ్చరించారు. నాయకులు దస్తగిరి, బాల ఓబులేసు, సంజీవరాయుడు, రాంబాబు, ఉసేని, రమేష్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గోస్పాడు: వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి గోపాల్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందుతున్నందున విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు.

నికరజలాల ఖరారుకు విభజన చట్టమే ప్రాతిపదిక


మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల(సెంట్రల్): రాయలసీమలో మిగులు జలాల ఆధారంగా నిర్మించిన ప్రాజెక్టులకు విభజన చట్టాన్ని ఆధారంగా చేసుకుని నికరజలాలు పొందే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి అన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల విషయంలో తెలంగాణకు అనుకూలంగా కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ తాజా తీర్పు నేపథ్యంలో గురువారం స్థానిక సమితి కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పోలవరం ఆధారంగా నిర్మించిన తాత్కాలిక ఎత్తిపోతల పథకమైన పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీరందించి, బదులుగా శ్రీశైలంలో ఆదా అయ్యే నీటిని సీమ ప్రాజెక్టులకు కేటాయిస్తామని చంద్రబాబు నాయుడు 2016లో హామీ ఇచ్చారని, కానీ నేటికీ అది కార్యరూపం దాల్చకపోవటం దురదృష్టకరమన్నారు. పోలవరం ద్వారా ఆదా అయ్యే నీటిని సీమ ప్రాజెక్టులకు నికర జలాలుగా కేటాయించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఈ నీటిని తమ హక్కుగా చెప్పుకుంటూ జీవో విడుదల చేసి పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలకు కేటాయించుకుంటున్నట్లు ఏకపక్షంగా వ్యవహరించిందన్నారు. తక్షణమే పట్టిసీమ ద్వారా ఆదా అయిన నీటిని హంద్రీనీవా, గాలేరు–నగరి ప్రాజెక్టులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు వైఎన్ రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, బాలీశ్వరరెడ్డి, శ్రీహరి, భాస్కర్‌రెడ్డి, పర్వేజ్, రామిరెడ్డి, షణ్ముఖరావు, రాముడు, నిట్టూరు సుధాకర్ రావు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

గోస్పాడు: గ్రామాల్లో సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీఓ భాస్కర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని తెలిపారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

ఉయ్యాలవాడ : ఉపాధి హామీ పథకం కింద 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామాల్లో అభివృద్ధి పనుల నిమిత్తం రూ.60 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అభివృద్ధి పనులపై తీర్మానం చేశారన్నారు. హరివరం గ్రామంలో రూ.15 లక్షలు, ఉయ్యాలవాడలో రూ.15 లక్షలు, బోడెమ్మనూరు, సర్వాయిపల్లె, మాయలూరు, ఇంజేడు, కాకరవాడ, రూపనగుడి గ్రామాలకు రూ.5 లక్షలు చొప్పున కేటాయించామన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే ఆయా గ్రామాల్లో మురుగు కాలువలు, అంతర్గత రోడ్ల నిర్మాణాలకు వెచ్చిస్తామని చెప్పారు.

నిందితులకు రిమాండ్

ఆళ్లగడ్డ: వైఎస్సార్‌సీపీ వర్గీయులపై దాడి చేసిన టీడీపీకి చెందిన పది మంది నిందితులను అదుపులోకి తీసుకుని గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ నరసింహులు తెలిపారు. కోటకందుకూరులో బుధవారం రాత్రి వినాయక నిమజ్జనం సందర్భంగా పాత కక్షలు మనస్సులో పెట్టుకుని సులోచన ఇంటిపై దాడిచేస్తుండగా అటుగా వచ్చిన శేఖర్, పెద్దసుబ్బయ్యపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. సులోచన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఆర్ల సుబ్రహ్మణ్యం, సుబ్బరాయుడు, లక్ష్మయ్య, రాముడు, రాయిని నరేశ్, ఉక్కల చిన్ననారాయణ, నాగేంద్ర, బోయ నడిపెన్న, బండి మోహన్, దేశ మధుసూదన్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారని ఎస్‌ఐ వివరించారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయండి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: ప్రభుత్వం నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో అధికారులు ప్రత్యేకంగా కృషి చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కారదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి సంబంధిత కార్యదర్శులతో కలిసి ఏపీ సెక్రటేరియట్ నుంచి వర్చువల్ విధానంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, జగనన్న ఆరోగ్య సురక్ష, గ్రామవార్డు సచివాలయాల సేవలు, ఐసీడీఎస్ పథకాలు, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు పరచేందుకు అధికారులందరూ సమన్వయంతో కృషి చేయాలని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలు అరికట్టేందుకు సంబంధిత కమిటీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. బడి బయట ఉన్న పిల్లల్లో కూడా అనీమియా అధికంగా ఉన్నట్లు సర్వేలో తేలిందని, వెంటనే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మలేరియా కేసులు అధికమవుతున్న నేపథ్యంలో వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్యులను ఆదేశించారు. అసంక్రమిత వ్యాధుల సర్వేలో భాగంగా బీపీ, షుగర్ అనీమియా వ్యాధిగ్రస్తులను గుర్తించి వైద్య చికిత్సలు అందించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించి, గిరిజన తండాల్లో ప్రతి ఒక్కరికి వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ నిర్ణయంపై హర్షం


షేక్ మహబూబ్ బాషా

శిరివెళ్ల: కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ ఏపీ కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో వైద్య శాఖ, కళాశాలల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. మండలంలోని యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్, ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మహబూబ్‌బాషా గురువారం మాట్లాడారు. 2000 సంవత్సరం నుంచి చాలీచాలనీ వేతనంతో చేస్తున్నామని, నాటి నుంచి తమను క్రమబద్ధీకరించాలని పోరాటాలు చేస్తున్నా ఫలితం లేకపోయిందన్నారు. 2018లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు నేడు నిర్ణయడం తీసుకోవడం సంతోషం. ఈ నిర్ణయం చట్టంగా మారితే.. రాష్ట్ర వ్యాప్తంగా తామే కాకుండా వివిధ శాఖల్లో పనిచేస్తున్న 10,133 మంది రెగ్యులర్ అవుతారు. ఇంటర్మీడియెట్‌లో 3,549 మంది, వైద్యశాఖలో 3,396 మంది,డిగ్రీ కళాశాలలో 663 మంది, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో 638, టెక్నికల్ ఎడ్యుకేషన్‌లో 440, ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రెనింగ్‌లో 300, అటవీశాఖలో 251 మంది, వాటర్ రిసోర్స్‌లో 210, మెడికల్ ఎడ్యుకేషన్‌లో 196, ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్‌లో140, ఇతర శాఖలలో మరో 334 మంది ఉద్యోగాలు రెగ్యులర్ అవుతాయి. వారి జీవితాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగు నింపారని కొనియాడారు.

క్రీడల్లోనూ రాణించాలి

ఉయ్యాలవాడ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని హెచ్‌ఎం చంద్రశేఖరయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని బోడెమ్మనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ నెల 19న నియోజకవర్గ స్థాయిలో ఆళ్లగడ్డ పాలసాగరం ఉన్నత పాఠశాలలో జరిగిన వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, ఖోఖో, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ పోటీల్లో పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థిని, విద్యార్థులు ప్రతిభ చూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు.

మహిళా రిజర్వేషన్‌తో దేశాభివృద్ధి

నంద్యాల(న్యూటౌన్): మహిళా రిజర్వేషన్ దేశాభివృద్ధికి దోహదపడుతుందని పీఎస్సీ, కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ అన్నారు. గురువారం స్థానిక డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులతో మహిళా సాధికారత సమావేశం నిర్వహించారు. చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడంతో విద్యార్థులకు బిల్లు గురించి అవగాహన కల్పించారు. అధ్యాపకులు శిరోమణి, కృష్ణమూర్తి, పార్వతి, లలిత, శశికళ, కుసుమ, రజిని పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి

నంద్యాల(అర్బన్): రైతులు రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. మండలంలోని అయ్యలూరు గ్రామంలో వరి పంటలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువులతో పంటలకు మేలు చేసే పురుగులు చనిపోతాయన్నారు. వరిలో సూక్ష్మ పోషకాలైన జింకు, ఐరన్‌ను వాడాలని సూచించారు. ప్రతి రైతు సేంద్రియ ఎరువులతో పంటలను సాగు చేయాలని సూచించారు. ఏఈఓ మణిమోహన్ రెడ్డి, ముక్తార్‌బాషా, వీఏఏలు పాల్గొన్నారు.

హామీల అమలులో కేంద్రం విఫలం

నంద్యాల(న్యూటౌన్): విభజన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఎండీ రఫీ తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ఉక్కు పరిశ్రమ, రాయలసీమకు ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో ఈ అంశాలపై చర్చించి విభజన హామీలు అమలు చేయాలని కోరారు. నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



నగళ్లపాడులో రక్తనమూనాను సేకరిస్తున్న సీహెచ్‌ఓ భాగ్యలక్ష్మి, శ్రీరంగాపురంలో సర్వే చేస్తున్న వైద్య బృందం

చాగలమర్రి: జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా మండలంలోని మద్దూరు సచివాలయ పరిధిలోని మద్దూరు, బ్రాహ్మణపల్లె, మల్లెవేముల సచివాలయ పరిధిలోని గొట్లూరు, రాజోలి, కలుగొట్లపల్లె, నగళ్లపాడు గ్రామాల్లో 3 రోజుల నుంచి సీహెచ్‌ఓలు భాగ్యలక్ష్మి, మహబూబ్‌హుసేన్, ఏఎన్ఎం నర్సమ్మ ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యులందరి ఆరోగ్య సమస్యలపై ఆరా తీసి, 7 రకాల పరీక్షలు నిర్వహించి ఫలితాలను వెంటనే ఆరోగ్య సురక్ష ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి వైద్యులకు అందుబాటులో ఉంచుతున్నారు. అలాగే వారి కుటుంబ సభ్యులందరికీ వైద్య చికిత్సల కోసం టోకెన్ అందజేస్తున్నారు. మల్లెవేముల సచివాలయ పరిధిలో ఉన్న గ్రామాలకు చెందిన వారికి వచ్చే నెల 3న మల్లెవేముల గ్రామ సచివాలయంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తారని, అలాగే మద్దూరు సచివాలయంలో 4వ తేదీన బ్రాహ్మణపల్లె, మద్దూరు గ్రామాలకు చెందిన వారికి వైద్య సేవలు అందజేస్తారని సీహెచ్‌ఓలు తెలిపారు. మొత్తం ఆయా గ్రామాలకు చెందిన 250 కుటుంబాలకు టోకెన్లను అందజేశామని చెప్పారు.

రుద్రవరం: మండలంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది ప్రారంభించారు. శ్రీరంగాపురం గ్రామంలో సాగుతున్న సర్వేలో రుద్రవరం పీహెచ్‌సీ వైద్యులు ప్రసాదు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సర్వేలో ఆరోగ్య సమస్యలను గుర్తించి సచివాలయ పరిధిలో నిర్వహించే వైద్య శిబిరంలో ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వైద్యశిబిరంలో ఇరువురు డాక్టర్లు,మరో ఇరువురు స్పెషలిస్టు డాక్టర్లు ఉంటారని చెప్పారు. సూపర్‌వైజర్లు వరలక్ష్మి, యోగీశ్వరయ్య, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీలత ఉన్నారు.

ఆళ్లగడ్డ: మండలంలోని కోటకందుకూరు ఏపీ మోడల్ స్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం కంటివైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌజన్య 6వ తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు చేసి, 31 మందికి చూపు దోషాలు ఉన్నట్లు చెప్పారు. వీరికి ప్రభుత్వం ఉచితంగా కంటి అద్దాలు అందజేస్తుందన్నారు. ప్రిన్సిపాల్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తగా..


పత్తి పొలంలో వాటర్ ట్యాంక్‌ను వినియోగించి రసాయన ఎరువులను వేస్తున్న రైతన్న

దొర్నిపాడు: వ్యవసాయ పనుల్లో కూలీల కొరతను అధిగమించేందుకు రైతులు ఎప్పటికప్పుడు నూతన పద్ధతులను అవలంభిస్తున్నారు. ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు సుబ్బయ్య. దొర్నిపాడు నివాసి. ఈయన రెండు ఎద్దులను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని పంటలకు తప్పనిసరిగా ఎద్దుల సాయంతోనే విత్తనాలు, రసాయన ఎరువులను విత్తాల్సి ఉంటుంది. దీంతో ఆ రైతు కొత్తగా ఆలోచించి.. తన వద్దనున్న నీళ్ల ట్యాంకును ఉల్టా చేసి దానికి వాల్వు ఏర్పాటు చేశాడు. దాని సాయంతో ఎరువులను సులభంగా, వేగంగా వేయగలుగుతున్నాడు. ఇలా అతను రోజుకు ఆరు ఎకరాల్లో పనులు చేస్తూ రూ.3వేల వరకు సంపాదిస్తున్నాడు.

వేగంగా..

దొర్నిపాడు: ప్రస్తుతం రైతుల పనులు చకచకా సాగిపోతున్నాయి. ఎకరా పొలంలో విత్తనం వేయాలంటే కేవలం 15 నిమిషాల్లో పూర్తవుతుంది. ఆధునిక వ్యవసాయ పనిముట్లు అందుబాటులోకి రావడంతో రైతన్న పనులు వేగంగా సాగుతున్నాయి. గతంలో విత్తనం వేయాలంటే విత్తనం గొర్రుపై మరో వ్యక్తి కూర్చొని విత్తనాలు లడిగలో వేయాల్సి వచ్చేది. ప్రస్తుతం విత్తనాలు ఓ డబ్బాలో పోస్తే సరి నిమిషాల్లో విత్తేస్తుంది. దీంతో రైతన్న పనులు వెంటనే పూర్తవ్వడమే కాకుండా కూలీల ఖర్చు మిగులుతుంది.


బుర్రారెడ్డిపల్లెలో ట్రాక్టర్ సాయంతో జొన్న విత్తనం వేస్తున్న దృశ్యం

సవ్యంగా..


దొర్నిపాడులో పత్తిలో క్రాసింగ్ పనులు చేస్తున్న కూలీలు

దొర్నిపాడు: మండలంలో విత్తన పత్తి క్రాసింగ్ పనులు మొదలయ్యాయి. వీటి పనులకు మహిళలే కీలకం. ప్రస్తుతం మండలంలో 1,060 హెక్టార్లలో పత్తి పంట సాగుచేశారు. ఒక్కో కూలీకి నెలకు రూ.12వేలు ఇస్తున్నారు. అంటే రోజుకూ రూ.400 కూలి వస్తుంది. ఇలా కూలీలకు మూడు నెలల పాటు ఈ ఉపాధి లభిస్తుంది. ఇందులో మహిళలు పత్తి క్రాసింగ్ చేయాల్సి ఉంటుంది. వీరు సవ్యంగా చేస్తేనే పంట దిగుబడి వస్తుంది.

నేడు హాకీ, బేస్‌బాల్ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎస్పీజీ మైదానంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాల అండర్–19 హాకీ, బేస్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీజీ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2005 సంవత్సరం తరువాత జన్మించిన వారు ఈ ఎంపికలకు అర్హులన్నారు.ఆన్‌లైన్‌లో రిజిష్టర్ చేసుకుని ఆధార్ జిరాక్స్‌తో 22వ తేదీ ఉదయం 10 గంటకు ఎస్పీజీ క్రీడా మైదానంలో హాజరు కావాలని సూచించారు.